


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక **PEN POWER TELUGU DAILY** ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 36 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 11 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥


VOLUME :11 ISSUE : 36 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 11 OCTOBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# కన్నీటి వీడ్కోలు


## అశ్రునయనాలతో రతన్ టాటా అంతిమయాత్ర

**శోకసంద్రమైన ముంబై నగరం**
**వేలాదిగా తరలివచ్చిన అభిమానులు**
**అమిత్ షా, చంద్రబాబు నివాళులు**





అజాత శత్రువు.. మానవత్వం మూ : ర్తీభవించిన గొప్ప వ్యక్తి, భారత దేశ దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా అంతిమయాత్ర ప్రారంభమైంది. ఉదయం ఎన్సీపీఏ గ్రౌండ్లో రతన్ టాటాపార్థివదేహానికి రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార ప్రముఖులు నివాళులు ఆర్పించారు. కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా హాజరయ్యారు. సాయంత్రం 4 గంటలకు రతన్ టాటా అంతిమ యాత్ర ప్రారంభమైంది. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా అంత్యక్రియలు నిర్వహించారు. రతన్ టాటా పార్థివ దేహానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలోకి చేర్చారు. జోహార్ రతన్ టాటా.. రతన్ టాటా అమర్ రహే అంటూ అభిమానులు నినాదాలు చేశారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ, సినీ, వ్యాపార, క్రీడారంగాలకు చెందిన ప్రముఖులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ కూడా రతన్ టాటా పార్థివ దేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.




# రతన్ టాటా భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్




**గత రాత్రి కన్నుమూసిన రతన్ టాటా**
**నిన్న అంత్యక్రియలు**
**రతన్ టాటా భౌతికకాయానికి నివాళులు అర్పించిన చంద్రబాబు, నారా లోకేశ్**

**పెన్ పవర్ డెస్క్:** ప్రఖ్యాత వ్యాపారవేత్త రతన్ టాటా పార్థివదేహాన్ని ముంబయిలోని నారిమన్ పాయింట్ వద్ద ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎన్సీపీఏ)కి తరలించారు. ప్రముఖులు, అభిమానులు, ప్రజలు ఎన్సీపీఏలో రతన్ టాటా భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్నారు. ఈ క్రమంలో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కూడా రతన్ టాటా భౌతికకాయాన్ని కడసారి వీక్షించి, ఆ దిగ్గజ వ్యాపారవేత్తకు నివాళులు అర్పించారు. టాటా కుటుంబ సభ్యులు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ లకు వెన్నంటి

వివరాలు 2లో..

# రతన్ టాటాకు భారత రత్న!

## మహారాష్ట్ర కాబినేట్ ప్రతిపాదన



**పెన్ పవర్ డెస్క్:**దిగ్గజ పారిశ్రామికవేత్త, ప్రముఖ ఫిలాంత్రఫిస్ట్ రతన్ టాటా ఇక లేరన్న విషయం అందరికీ తెలిసిందే. అక్టోబర్ 9న భారతదేశం ఓ గొప్ప మనవతా మూర్తిని

వివరాలు 2లో..

# రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబే..



**పెన్ పవర్ డెస్క్:**తనకు రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబేనని, టీడీపీ, బీజేపీ పొత్తు వల్లే తాను ఆ నాడు ఎంపీగా ఎన్నికయ్యానని మాజీ మంత్రి,

వివరాలు 2లో..

# విలువలు, విశ్వసనీయతే మనకు శ్రీరామరక్ష

- కష్టాలు ఎప్పుడూ శాశ్వతంగా ఉండిపోవు
- చీకటి తర్వాత వెలుగు తప్పనిసరి. ఇది సృష్టి సహజం
- మనం ఐదేళ్లు తలెత్తుకునే పాలన చేశాం
- బడ్జెట్తో పాటు, సంక్షేమ క్యాలెండర్ ఇచ్చాం
- క్రమం తప్పకుండా అన్నీ పక్కాగా అమలు చేశాం
- గతంలో ఏ ప్రభుత్వం ఏనాడూ అలా చేయలేదు
- విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- మనం చేసిన మంచి ప్రతి ఇంట్లోనూ బ్రతికే ఉంది
- చంద్రబాబు అబద్ధాలతో మనం పోటీ పడలేకపోయాం
- ఆయన అధికారం చేపట్టి ప్రజలను మోసం చేశారు
- పథకాలు అటకెక్కాయి. వ్యవస్థలు పూర్తిగా దిగజారాయి
- రాష్ట్రంలో కేవలం రెడ్బుక్ పాలన మాత్రమే సాగుతోంది
- అన్ని చోట్లా హద్దుల్లేని అవినీతి జరుగుతోంది
- కూటమి పాలనపై మాజీ సీఎం ధ్వజం
- ప్రతి నియోజకవర్గంలో యథేచ్ఛగా పేకాట క్లబ్బులు
- మద్యం అమ్మకాల్లోనూ ఎక్కడిక్కడ అవకతవకలు
- గ్రామాల్లో మళ్లీ బెల్టు షాపులు మొదలయ్యాయి
- ఇసుక ఉచితం లేదు. గతం కన్నా రెట్టింపు ధరలు
- అయినా ఇసుక కొరత. భవన నిర్మాణ రంగం కుదేలు
- మోపిదేవి విషయంలో ఎప్పుడూ తప్పు చేయలేదు
- ఏ రోజైనా ఆయనకు మంచే చేశాం
- ఎమ్మెల్యేగా ఓడినా కేబినెట్ మంత్రిని చేశాను
- అడిగిన వెంటనే రాజ్యసభకు కూడా పంపాం
- ఒక మత్స్యకారుడికి తొలిసారిగా రాజ్యసభ సభ్యత్వం
- అది కచ్చితంగా వైయస్ఆర్సీపీ ఘనత
- మోపిదేవి పార్టీ వీడడం బాధాకరం
- రేపల్లె నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో వైయస్ జగన్మోహన్రెడ్డి సమావేశం. పలు అంశాలపై దిశానిర్దేశం.



**పెన్ పవర్ డెస్క్:** మన వ్యక్తిత్వం. విలువలు, విశ్వసనీయతే మనకు శ్రీరామ రక్ష. మన వ్యక్తిత్వమే మనల్ని ముందుకు నడిస్తుందని వైయస్ఆర్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.రేపల్లె నియోజకవర్గంలో అనుకోని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. కష్టాలు ఎప్పుడూ శాశ్వతంగా ఉండవు. చీకటి తర్వాత వెలుగు తప్పకుండా వస్తుంది, ఇది సృష్టి సహజం. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్లో రేపల్లె నియోజకవర్గ స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**5ఏళ్లు గర్వంగా తలెత్తుకునేలా:**

2019 నుంచి 2024 వరకు మనం గర్వంగా తలెత్తుకునేలా పరిపాలన చేశాం. నేను వైయస్ఆర్సీపీ కార్యకర్తను అని ప్రతి కార్యకర్త, ప్రతి ఇంటికి వెళ్లి గర్వంగా చెప్పుకునేలా మన పాలన సాగింది. అన్ని పనులు మనం ప్రజలకు చేశాం. మ్యానిఫెస్టో అనేది చెత్తబుట్టలో వేయదగింది కాదని, అది అత్యంత పవిత్రమైనదని ప్రపంచానికి తొలిసారిగా మన పార్టీ మాత్రమే చెప్పింది. ప్రజలకు ఇచ్చిన మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుబోమని వాటిని నెరవేరుస్తూ అడుగులు వేశాం. మొట్టమొదటి బడ్జెట్లోనే సంక్షేమ క్యాలెండర్ ప్రకటించాం. ప్రతి నెలా క్రమం తప్పకుండా బటన్ నొక్కి పారదర్శకంగా పథకాలన్నీ అమలు చేశాం. మన ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరింది. మనకు వేటు వేశాడా, లేదా, అన్నది మాత్రమే కాదు. కులం, మతం కూడా చూడకుండా పథకాలు డోర్ డెలివరీ చేసి అండగా నిలబడ్డ ప్రభుత్వం మనది.

వివరాలు 2లో..

# ఏ రాష్ట్ర క్యాడర్ ఆ రాష్ట్రంలోనే పనిచేయాలి

## ఏపీ, తెలంగాణ క్యాడర్ విభజనపై కేంద్రం కీలక నిర్ణయం

- ఏపీకి కేటాయించాలన్న ఐదుగురు ఐఏఎస్ అధికారుల విజ్ఞప్తికి నో చెప్పిన కేంద్రం
- తాజాగా ఏపీ నుంచి ఐదుగురు ఐఏఎస్ లను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు
- తెలంగాణ ఐఏఎస్, ఐపీఎస్ లకు కేంద్రం షాక్ : ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశం
- ఆమ్రపాలి సహా పలువురు అధికారుల విజ్ఞప్తికి కేంద్రం తిరస్కరణ... ఏపీకి వెళ్లాలని ఆదేశాలు
- తెలంగాణకు కేటాయించాలని కేంద్రాన్ని కోరిన ఆమ్రపాలి, రొనాల్డ్ రోస్
- 11 మంది అధికారుల విజ్ఞప్తిని తిరస్కరించిన కేంద్రం
- ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ, తెలంగాణ క్యాడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ క్యాడర్ కు చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులను ఏపీ నుంచి రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తమను ఏపీలోనే కొనసాగించాలని ఆ అధికారుల అభ్యర్థనలను కేంద్రం తిరస్కరించింది. అనంతరాము, ఎస్ఎస్ రావత్, హరికిరణ్, సృజన, శివశంకర్ ఏపీ క్యాడర్ ను కోరుకోగా, కేంద్రం వారికి నో చెప్పింది. కేటాయించిన క్యాడర్ రాష్ట్రాల్లోనే కొనసాగాలని తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అటు,

వివరాలు 2లో..

# రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం...

## ఏపీ, తెలంగాణకు ఎంతంటే...!

- ఈసారి రూ.1,78,173 కోట్ల మేర పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం
- ఏపీకి రూ.7,211 కోట్లు... తెలంగాణకు రూ.3,745 కోట్లు విడుదల
- అత్యధికంగా యూపీకి రూ.రూ.31,962 కోట్లు

**పెన్ పవర్ డెస్క్:** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసింది. రాష్ట్రాల అభివృద్ధి, మూల ధన వ్యయానికి ఊతమి చ్చేందుకు ఈ నిధులు ఉపయోగపడతా యని కేంద్రం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలకు అందించే నెలవారీ పన్నుల వాటా రూ. 89,086.50 కోట్లు కాకుండా... ఈసారి రూ. 1,78,173 కోట్ల మేర పన్నుల

వివరాలు 2లో..




# 4 నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత



**పెన్ పవర్ డెస్క్:** ఏపీలో కమీషన్లు, ముడు పులు, దందాలతో టీడీపీ ఎమ్మెల్యేలు దారితప్పారని, 4 నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినట్లు వైయస్ఆర్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పనితీరుపై విజయసాయిరెడ్డి ఎక్స్ వేదికగా ఎండగట్టారు, పోస్టింగులకు ఒక రేటు, మద్యంలో నెలమామూళ్లు, వెంచర్లలో కమీషన్లు, కాంట్రాక్టర్ల

వివరాలు 2లో..

# అమెరికా పర్యటనకు వెళ్లనున్న ఏపీ మంత్రి నారా లోకేశ్

- అక్టోబరు 25 నుంచి నవంబరు 1 వరకు అమెరికాలో లోకేశ్ పర్యటన
- శాన్ ఫ్రాన్సిస్కోలో ఐటీ సర్వ్ సినర్జీ కాన్ఫరెన్స్
- హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్
- ఏపీకి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా పర్యటన

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 25 నుంచి నవంబరు 1 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. నారా లోకేశ్ శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో ఐటీ సర్వ్ సినర్జీ సదస్సుకు హాజరుకానున్నారు.



ఎడిటర్ వ్యూ

# కాంగ్రెస్ పరాన్న జీవేనా

హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శరాఘాతంగా మారాయి. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓ 30 పార్టీలతో జతకట్టి 'ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ పేరుతో కూటమిని కట్టి భారతీయ జనతా పార్టీని కొంత మేర నిలువరించగలిగింది. అంతే తప్ప బీజేపీ సారథ్యంలోని 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. పదేళ్లలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను చూస్తే బీజేపీతో ముఖాముఖి ఒంటరిగా తలపడ్డ అనేక సందర్భాల్లో ఓటమి పాలవుతూ వస్తోందని అర్థమవుతోంది.తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బీజేపీని ఢీకొట్టలేక హర్యానాలో చతికిలపడగా.. జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తో జతకట్టి గెలుపును సొంతం చేసుకుంది. ఇంకా లోతుగా వెళ్తే.. ఇక్కడ బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడ్డ చోట్ల కమలదళానిదే పైచేయి. కాంగ్రెస్ పోటీ చేసిన 39 సీట్లలో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ గెలిచిన సీట్లలో ఒక్కటి కూడా హిందూ జనాభా ఎక్కువగా ఉన్న సీటు లేదు. గెలిచిన అభ్యర్థుల్లో ఒక్కరు కూడా హిందువు లేరు. దీన్ని బట్టి ఆ కొన్ని సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ పుణ్యమే అని స్పష్టమవుతోంది.హర్యానాలో జాట్-దళిత-మైనారిటీ కాంబినేషన్‌తో ఒంటరిగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం చాలావరకు కలిసొచ్చినా.. జాటేతర వర్గాలు బీజేపీ వైపు ఏకీకృతం కావడంతో అనుకున్నది సాధించలేకపోయింది. కనీసం ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీలలో ఏ ఒక్క పార్టీతో పొత్తు పెట్టుకున్నా పరిస్థితి మరోలా ఉండేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతంలో వ్యత్యాసం 1 శాతం కంటే తక్కువే. బీజేపీ 39.94% ఓట్లతో 48 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ 39.09% ఓట్లు సాధించినప్పటికీ 37 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ఆప్ (1.79%), బీఎస్పీ (1.82%), ఐఎన్ఎల్డీ (1.14%) ఓట్లు సాధించాయి. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటముల మధ్య తేడా వందల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ ఇతర పార్టీతో జతకట్టినా కాంగ్రెస్ అధికారం సాధించగలిగేదని స్పష్టమవుతోంది. జాతీయస్థాయిలో బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా 30 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మాత్రం "తాను మాత్రమే గెలవాలి.. మరొకరికి భాగం ఉండరాదు" అన్నట్టుగా వ్యవహరించింది. తనకు తగిన బలం లేదు అనుకున్న రాష్ట్రాల్లో మాత్రమే స్థానికంగా బలంగా ఉన్న ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టి పోటీ చేస్తోంది.గతంలో జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడి ఓటమిపాలైంది. ఉత్తరాదిన హిమాచల్‌లో మాత్రమే గెలుపొందగలిగింది. తెలంగాణలో విజయం సాధించినప్పటికీ.. అక్కడ పోటీపడింది కేవలం బీజేపీతో మాత్రమే కాదు. అప్పటి వరకు తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితితో తలపడి ముక్కోణపు పోటీలో 39% ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ లెక్కన చూస్తే బీజేపీతో నేరుగా తలపడడంలో కాంగ్రెస్ తడబడుతోందని స్పష్టమవుతోంది. ఓ ఇద్దరు ముగ్గురిని వెంటేసుకుని వెళ్తేనో.. లేకపోతే ముక్కోణపు పోటీ లేదా బహుముఖ పోటీ ఉన్నప్పుడో కాంగ్రెస్ విజయాలు సాధించగల్గుతోంది. హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పేరుగాంచిన ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ పార్టీ నేటికీ పట్టు సాధించలేకపోతోంది. గత పదేళ్లలో చత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అధికారం అందినా ఐదేళ్ల తర్వాత రెండోసారి గెలుపొందలేకపోయింది.ఉత్తరాది రాష్ట్రాల్లో పట్టు సాధిస్తే తప్ప జాతీయ రాజకీయాల్లో విజయాలు సాధించలేమని ఆ పార్టీ వ్యూహకర్తలకు తెలుసు. 90వ దశకం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ సారథ్యంలో 3 సార్లు ప్రభుత్వాలు ఏర్పడినా.. వాటిలో ఒక్కసారి కూడా పూర్తి మెజారిటీతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది లేదు. పీవీ నరసింహారావు సైతం పూర్తి మెజారిటీ లేని ప్రభుత్వాన్ని ఐదేళ్ల పాటు నడపగా.. తర్వాత మన్మోహన్ సింగ్ హయాంలో కూడా యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ పేరుతో సంకీర్ణ ప్రభుత్వాలే ఏర్పాటయ్యాయి. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రం నానాటికీ బలపడుతూ హిందీ రాష్ట్రాల్లో గట్టి పట్టు సాధిస్తూ ముందుకు కదులుతోంది. గత మూడున్నర దశాబ్దాల్లో బీజేపీ 2 పర్యాయాలు సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ మార్కు దాటింది. ఈసారి కాస్త 30కి పైగా పార్టీలతో ఏర్పడ్డ ఇండి-కూటమిని ఎదుర్కోవడంలో కాస్త తడబడాల్సి వచ్చింది.గత ఏడాది 34 పార్టీలతో ఏర్పాటైన ఇండి-కూటమి అనేక రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బీజేపీని ఢీకొట్టింది. వాటిలో దక్షిణాదిన కర్ణాటకలో మాత్రమే నేరుగా బీజేపీతో తలపడగా, మిగతా రాష్ట్రాల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు, కూటములతో తలపడింది. కర్ణాటకలో బీజేపీ మీద, తెలంగాణలో బీఆర్ఎస్ మీద మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి 20కి 18 చోట్ల గెలుపొందింది. తమిళనాడులో మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగం తో కలిసి గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయింది.ఇక, ఉత్తరాది రాష్ట్రాల్లో.. బిహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్ము-కాశ్మీర్‌లో స్థానికంగా బలంగా ఉన్న మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. బెంగాల్‌లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసినా ఆ రాష్ట్రంలో ప్రధాన పోరు తృణమూల్ కాంగ్రెస్ (ఒఓఅ), బీజేపీ మధ్యనే సాగింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ంంఖ)తో జట్టుకట్టినా, ఆ స్నేహం పంజాబ్‌లో అమలు కాలేదు. అయితే కొన్ని చోట్ల ఈ కూటములు, పొత్తులు ఫలించి కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం)తో కలిసి కొన్ని సీట్లు, యూపీలో సమాజ్‌వాదీ పార్టీతో కలిసి కొన్ని కాంగ్రెస్ ఖాతాలో అదనంగా చేరాయి.హర్యానా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవిగా మారిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 99 సీట్లలో సగం వరకు మిత్రపక్షాల బలంతోనే వచ్చాయని సూత్రీకరించారు. అయితే మిత్రపక్షాలు కాంగ్రెస్‌పై ఆధారపడిన రాష్ట్రాల్లో వారి ఎన్నికల నౌకలు మునిగిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ఎంత పరాన్నజీవి అంటే అది తన సొంత మిత్రులను మింగేస్తుందని మోదీ విరుచుకుపడ్డారు. "తన గెలుపు కోసమే పొత్తు.. తాను ఒంటరిగా గెలిచేలా ఉంటే ఎవరూ వద్దు" అన్నది కాంగ్రెస్ విధానంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు ఆ పార్టీని వరుస ఓటములతో ముంచేస్తోంది.

# విలువలు, విశ్వసనీయతే మనకు శ్రీరామరక్ష

- మొదటి పేజీ తరువాయి

అలాంటి ప్రభుత్వం చరిత్రలో ఎప్పుడూ లేదు.

పథకాలు అమలు చేయకుండా ఉండేందుకు చాలా కారణాలు చూపొచ్చు. కానీ, మనం ఆ పని చేయలేదు. మన హయాంలో కోవిడ్ వంటి సంక్షోభం ఎదుర్కొన్నాం. అయినా ఏ పథకాన్ని ఆపలేదు. పైగా, అంతకు ముందు చంద్రబాబు చేసిన అప్పుల భారం కూడా మన మీద పడింది. ఆ అప్పుల భారాన్ని కూడా మనం మోశాం. చాలా బకాయిలు పెట్టి పోయారు. దాదాపు రూ.20 వేల కోట్ల కరెంటు బిల్లులు వదిలిపెట్టి వెళ్లారు.

మనం అధికారంలో ఉన్నప్పుడు రెండేళ్ల పాటు కోవిడ్‌తో యుద్ధం చేశాం. ఈ సమయంలో అనూహ్యంగా రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం తగ్గి, మరోవైపు ఖర్చు విపరీతంగా పెరిగింది. అయినా ఏరోజూ సాకులు చూపకుండా పథకాలు అమలు చేశాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి ఒక్కటీ అమలు చేయాల్సిన ధర్మం మన మీద ఉందని భావించి అన్నీ చేశాం.

పూర్తి పారదర్శకంగా పథకాలు అమలు చేసి, బటన్ నొక్కి నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో నగదు జమ చేశాం. తొలిసారిగా డెలివరీ మెకానిజంలో లంచాలు లేకుండా, కేవలం వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలోనే ఇవ్వొచ్చు అని రుజువు చేసి చూపాం.

**కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు:**

మరోవైపు విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చాం. స్కూళ్లలో ఎప్పుడూ చూడని మార్పులు చేశాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ బోధన, ఇంగ్లిషు మీడియం, నాడు%-%నేడుతో స్కూళ్ల మార్పులు, సీబీఎస్‌ఈ సిలబస్, టోఫెల్ క్లాసులు, ఎనిమిదో తరగతికి వచ్చేసరికి పిల్లల చేతుల్లో ట్యాబులు పెడుతూ ఎప్పుడూ చూడని మార్పులు తీసుకు వచ్చింది కూడా మన ప్రభుత్వమే. వైద్య రంగంలోనూ ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చాం. మనం అధికారంలోకి రాక ముందు కేవలం వేయి చికిత్సలకు మాత్రమే పరిమితమైన ఆరోగ్యశ్రీని 3350 ప్రొసీజర్లకు పెంచాం. ఏకంగా పేదలకు రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీని పరిధిని పెంచాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆరోగ్య ఆసరా కూడా తీసుకు వచ్చాం. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారుస్తూ నాడు%-%నేడు తీసుకొచ్చాం. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లే ఉండరు అన్న పరిస్థితి నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూశాం. జీఎంపీ ప్రమాణాలున్న మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇచ్చాం. కొత్తగా 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టాం.

మన గ్రామంలోనే వైద్యం కోసం వైయస్ఆర్ విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేశాం. అక్కడే 105 రకాల మందులు, 14 రకాల టెస్టులు చేసే విధంగా ఆరోగ్య సురక్ష అందుబాటులోకి తెచ్చాం.

వ్యవసాయ రంగంలోనూ గణనీయమైన మార్పులు తీసుకుని వచ్చాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉచిత పంటల బీమా కేవలం వైయస్సార్సీపీ ప్రభుత్వంలోనే అమలైంది. రైతులకు పెట్టుబడి భరోసా ఇచ్చింది, పక్కాగా అమలు చేసింది మన ప్రభుత్వం మాత్రమే. మొదటిసారిగా ఇ%-%క్రాపింగ్, ఆర్బీకేలు, ఉచిత పంటల బీమా, తొలిసారిగా రైతులకు దళారీ వ్యవస్థ లేకుండా పంటలు కొనుగోలు చేసే కార్యక్రమం కూడా వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగింది. అక్కచెల్లెమ్మల రక్షణ కోసం దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం. అక్కచెల్లెమ్మలు ఇంటి నుంచి బయటకు ధైర్యంగా వెళ్లడానికి వీలుగా ఆ యాప్ అందుబాటులోకి తెచ్చాం. ఆపదలో ఎస్ఓఎస్ బటన్ నొక్కిన పది నిమిషాల్లో పోలీసులు చేరుకుని, వారిని కాపాడే పరిస్థితి ఉండేది.

**ఆ మంచి ప్రతిచోటా కనిపిస్తోంది:**

మనం చేసిన మంచి పనులు ఎక్కడికీ పోలేదు. మనం చేసిన మంచి ప్రతి ఇంట్లో బ్రతికే ఉంది. మన కార్యకర్తలు ఏ గ్రామంలోనైనా ఈ పనులన్నీ చేశామని గర్వంగా చెప్పుకోగలరు. అయినా కూడా చంద్రబాబులా మనం అబద్ధాలు ఆడలేకపోయాం. చంద్రబాబు అబద్ధాలతో పోటీ పడలేకపోయాం. వాళ్లు ఓట్లు అడగడానికి వెళ్లి మోసంతోనే ప్రచారం చేశారు.

**చంద్రబాబు అబద్ధాలతో మోసం:**

ఓట్లు అడగడానికి వెళ్లిన ప్రతి చోటా అబద్ధాలు చెప్పి అందరినీ మోసం చేశారు. వాలంటీర్లను తీసేయబోమని, వారికి రూ.10 వేల వేతనం ఇస్తామని చెప్పి దగా చేశారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఎంత మంది ఉన్నా.. పిల్లలు కనిపిస్తే నీకు రూ.15 వేలు అని, వారి తల్లి కనిపిస్తే నీకు రూ.18 వేలు అని, వాళ్ల చిన్నమ్మ కనిపిస్తే నీకూ రూ.18 వేలు అని, 50 ఏళ్లకు పైబడిన మహిళ కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, కండువాతో రైతు కనిపిస్తే నీకు రూ.20 వేలు అని ప్రతి ఒక్కరికీ సంఖ్యలు చెప్పి అబద్ధాలతో మోసం చేశారు. నేను కూడా ఒకవేళ అలాంటి అబద్ధాలు చెప్పి ఉంటే, ఈరోజు సీఎం స్థానంలో ఉండేవాడిని. కానీ, మీలో ఎవరైనా ఇవాళ ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లే పరిస్థితి ఉండేదా?.

**వ్యవస్థలన్నీ దారుణ పతనం:**

ఈరోజు చంద్రబాబుగారు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ తెలుగుదేశం కార్యకర్తలు గ్రామంలో ఏ ఇంటికీ వెళ్లలేని పరిస్థితి. పిల్లలు రూ.15 వేల గురించి అడుగుతారు. మహిళలు రూ.18 వేల గురించి అడుగుతారు. పెద్దవాళ్లు రూ.48 వేల గురించి అడుగుతారు. రైతులు నా రూ.20 వేలు ఏమయ్యాయని అడుగుతారు. ఒకవైపు పథకాల పరిస్థితి ఇలా ఉంటే.. మరోవైపు వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారిపోయాయి.

విద్య, వైద్య రంగాలను నాలుగు నెలల్లోనే నాశనం చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని పేదవాడు వెళితే వైద్యం చేస్తారన్న నమ్మకం లేని పరిస్థితి వచ్చింది. వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయి. దాదాపుగా రూ.2400 కోట్లు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. పిల్లలకు మూడు నెలలకొకమారు ఇవ్వాల్సిన విద్యాదీవెన, వసతి దీవెన మూడు క్వార్టర్లు గడిచినా ఇవ్వలేదు. రైతులకు ఖరీఫ్ సీజన్ ముగిసినా పెట్టుబడి సహాయం లేదు. ఆర్బీకేలు లేవు. ధాన్యం కొనుగోలులో మళ్లీ దళారులు వచ్చారు.

నాడు%-%నేడు లేదు. ఇంగ్లిషు మీడియం లేదు. ఏ పథకమూ డోర్ డెలివరీ లేకుండా చేశారు. తెలుగుదేశం పార్టీ నేతల ఇళ్లకు వెళ్తేనే వాళ్ల సమక్షంలో పథకాలు ఇచ్చే పరిస్థితి. అక్కడకు వెళ్లకపోతే పథకాలు నిలిచిపోతాయి. ఇప్పటికే లక్షన్నర పెన్షన్లు కట్ చేశారు.

**రెడ్‌బుక్ పాలన:**

రాష్ట్రంలో ఇప్పుడు రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది. ప్రజలను భయపెడుతున్నారు. తప్పుడు కేసులు పెడుతున్నారు. ప్రలోభాలకు గురి చేస్తున్నారు. హద్దుల్లేని అవినీతి జరుగుతోంది. అన్ని వ్యవస్థలు కూలిపోయాయి. అంతులేని అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం పది పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలు పెంచే కార్యక్రమం నడుస్తోంది. డిస్టలరీస్ నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. లిక్కర్ సిండికేట్స్ అప్పుడే మొదలయ్యాయి. గ్రామ, గ్రామాన బెల్టు షాపులు ప్రమోట్ చేసే కార్యక్రమం నడుస్తోంది.

ఇక ఇసుక గురించి మాట్లాడలేని పరిస్థితి. మన హయాంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ఇవాళ ఉచితం లేదు కానీ, రెట్టింపుకన్నా, ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారు.

**చంద్రబాబుకు పరాజయం తప్పదు:**

చంద్రబాబు అన్ని రకాలుగా అబద్ధాలు చెప్పారు. ప్రజలను అబద్ధాలతో మోసం చేశారు. ఆ మోసాలకు గురైన ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అన్నీ చేసిన మనకే ఇలా అయితే, ప్రజలను ఇంతలా మోసం చేసి, అన్నీ అబద్ధాలే చెప్పిన చంద్రబాబును ప్రజలు ఏం చేస్తారు?. ఆయన ప్రజలను ఎన్ని రోజులు భయపెడతారు?. ఎన్ని రోజులు కేసులు పెడతారు?. ప్రజలకు అన్నీ తెలుసు. అందుకే ఆయనకు పరాజయం తప్పదు. చంద్రబాబుకు సింగిల్ డిజిట్ కూడా ఇవ్వరు. ఇది నిజం.

**మోపిదేవి వీడడం బాధాకరం:**

మోపిదేవి వెంకటరమణ పార్టీ వీడి వెళ్లిపోవడం బాధాకరం. ఆయన విషయంలో ఎప్పుడూ తప్పు చేయలేదు. ఏరోజైనా మంచే చేశాం. తాను ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎమ్మెల్సీని చేశాం. అంతటితో మర్చిపోకుండా మంత్రి పదవి ఇచ్చి కేబినెట్‌లో పెట్టుకున్నాను. మండలిని రద్దు చేయాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఆయన పదవి పోకుండా అడిగిన వెంటనే రాజ్యసభకు పంపాం. ఒక మత్స్యకారుడికి తొలిసారిగా రాజ్యసభ ఇచ్చిన ఘనత మన పార్టీది. మనం ఆయనను ఎక్కడా తక్కువ చేయలేదు.

**గణేష్ మీ మనిషి:**

ఇప్పుడు గణేష్‌కు మీ మద్దతు చాలా అవసరం. మనిషి మంచి వాడు. కార్యకర్తకు ఏం జరిగినా నా దృష్టికి తీసుకొస్తాడు. గణేష్‌లో ఆ మంచి గుణం ఉంది. ఆయన మీలో ఒకడు. మీ నుంచి వచ్చిన వాడు.

**కష్టాలు శాశ్వతం కాదు:**

ఎవరికైనా వ్యక్తిత్వం ముఖ్యం. కష్టాలు కొత్తేమీ కాదు. రాజకీయాల్లో కష్టాలు శాశ్వతం కాదు. నన్నే ఉదాహరణగా తీసుకోండి. మా నాన్న ముఖ్యమంత్రి. అయినా కష్టాలు వచ్చాయి. పెద్దవాళ్లంతా ఏకమయ్యారు. తప్పుడు కేసులు పెట్టారు. ఏకంగా 16 నెలలు జైల్లో పెట్టారు. వేధించారు.

# రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం...

- మొదటి పేజీ తరువాయి

వాటా విడుదల చేసినట్టు కేంద్ర ప్రభుత్వం నేడు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇందులోనే ఒక నెల ముందస్తు చెల్లింపు (అడ్వాన్స్ పేమెంట్)ను కూడా చేర్చినట్టు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పన్నుల వాటా రూపంలో రూ.7,211 కోట్లు దక్కనుండగా... తెలంగాణకు రూ.3,745 కోట్లు లభించనున్నాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ కు రూ.31,962 కోట్ల మేర పన్నుల వాటా కేటాయించారు.

బీహార్ కు రూ.17,921 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,987 కోట్లు, మహారాష్ట్రకు రూ.11,255 కోట్లు, పశ్చిమ బెంగాల్ కు రూ.13,404 కోట్లు, రాజస్థాన్ కు రూ.10,737 కోట్లు, ఒడిశాకు రూ.8,068 కోట్లు పన్నుల వాటా రూపేణా దక్కనున్నాయి.

# రతన్ టాటాకు భారత రత్న!

- మొదటి పేజీ తరువాయి

కోల్పోయింది. మహారాష్ట్ర మంత్రివర్గం అక్టోబర్ 10ని సంతాప దినంగా ప్రకటించింది. మహారా ష్ట్ర ప్రభుత్వం రతన్ టాటా అంత్యక్రియలు అధికారికంగా నిర్వహిస్తోంది.భారతరత్న అవార్డుకు ఇండస్ట్రియలిస్ట్ రతన్ టాటా పేరును ప్రతిపాదించాలని మహారాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో నిర్ణయించింది. ముంబైలోని ఎన్‌సిపిఎలో రతన్ టాటా భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీలకు అతీతంగా నాయకులు ఆయనకు నివాళులు అర్పించడానికి తరలివస్తున్నారు.దివంగత పారిశ్రామికవేత్తకు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ మహారాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది. దేశంలో రెండవ అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ ఇది వరకే ఆయనకు లభించింది. కొత్త వ్యాపారాలను నెలకొల్పి దేశాన్ని పురోగతి, అభివృద్ధి పథంలో తీసుకెళ్లవచ్చని

ఆయన నిరూపించారని కాబినేట్ గుర్తుచేసుకుంది. దేశం పట్ల ప్రేమ, సమాజ అభ్యున్నతి కోసం నిజాయితీ భావాలుతో రతన్ టాటా పని చేశారని ఆయన సేవలు కొనియాడారు. దేశం పట్ల, సమాజం పట్ల నిబద్ధత కలిగిన ఓ మహనీయుడిని మనం కోల్పోయామన్నారు.

# ఏ రాష్ట్ర క్యాడర్ ఆ రాష్ట్రంలోనే పనిచేయాలి

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణ క్యాడర్ లోనే కొనసాగుతామన్న పలువురు ఉన్నతాధికారుల విజ్ఞప్తికి కూడా కేంద్రం అభ్యంతరం చెప్పిన సంగతి తెలిసిందే. దాంతో, తెలంగాణ నుంచి ఆమ్రపాలి, రొనాల్డ్ రాస్ వంటి ఐఏఎస్ లు ఏపీకి రానున్నారు. తెలంగాణ కేడర్ కావాలని కోరిన 11 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరిం చింది. ఈ విజ్ఞప్తి చేసిన 11 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాలని కేంద్రం ఆదేశించింది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ అధికారులు ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్ కూడా కేంద్రం ఆదేశాల మేరకు ఏపీలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.తెలంగాణలో విధుల్లో ఉన్న ఏపీ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్‌లు ఏపీలో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఉత్తర్వులు పంపింది. సదరు ఐఏఎస్, ఐపీఎస్‌ల పేరిట కేంద్రం లేఖలు రాసి.. ఆ లేఖల కాపీలను సీఎస్‌లకు పంపడం గమనార్హం. ఆమ్రపాలి ప్రస్తుతం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా విధుల్లో ఉండగా, రోనాల్డ్ రోస్ తెలంగాణ విద్యుత్ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# రాజకీయ భిక్ష పెట్టింది చంద్రబాబే..

- మొదటి పేజీ తరువాయి

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చెప్పారు. ఇవాళ తన అల్లుడు, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డితో భేటీ అయ్యారు. తన మనవరాలి పెళ్లి కార్డును కిషన్ రెడ్డికి అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాము రాజకీయాలు మాట్లాడలేదని, తన మనవరాలి పెళ్లికి రావాలని ఆహ్వానించానని చెప్పారు. కిషన్ రెడ్డి రెండో సారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. టీడీపీలో చేరుతున్నారా..? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాట వేశారు.

# అమెరికా పర్యటనకు వెళ్లనున్న ఏపీ మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా, ఏపీకి పెట్టుబడులు ఆకర్షించేందుకు వివిధ కంపెనీల ప్రతినిధులతో లోకేశ్ సమావేశం కానున్నారు. ఏపీలో ఇటీవలే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ పురోగతికి వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో లోకేశ్ అమెరికా పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. అమెరికా పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ ప్రముఖ టెక్ కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా లోకేశ్ పర్యటన కొనసాగనుంది.

# రతన్ టాటా భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

ఉండి, రతన్ టాటా భౌతికకాయం ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబు... రతన్ టాటా భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచారు. కాగా, మరి కొద్దిసేపట్లో రతన్ టాటా అంత్యక్రియలు జరగనున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# 4 నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- మొదటి పేజీ తరువాయి

దగ్గర పెర్సెంటేజిలు, ప్రొటెక్షన్ మనీ, అంటూ బరితెగించిన టీడీపీ ఎమ్మెల్యేలు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ గూఢచారులుగా ప్రవర్తించిన అధికారులకు క్లీన్ చిట్‌లు, మంచిరాబడి ఉన్న పోస్టింగులు, పదోన్నతులు.

**మద్యంషాపుల దరఖాస్తుల్లో టీడీపీ ఎమ్మెల్యేలు సిండికేట్ అయ్యి సర్కార్ ఖజానాకు గండి.**

లిటిగేషన్లు, నోటిదురుసులు, వ్యభిచారాలు, ఆమ్యామ్యాలు, మాఫియాలు, దందాలు, బ్లాక్మెయిలింగ్, వెంచర్లు, మద్యం....,.దేన్నీ వదలకుండా టీడీపీ ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా దిగమింగే దాంట్లో పూర్తి నిమగ్నం.

ఐదు సంవత్సరాల తర్వాత అవకాశం దొరికినప్పుడు మేం మింగితే తప్పేమిటి......మళ్ళీ మళ్ళీ అవకాశం వస్తుందో రాదో .....అని అడ్డంగా సమర్థించుకుంటున్న తెలుగు తమ్ముళ్లు. టీడీపీ ఎమ్మెల్యేలపై వస్తున్న ఆరోపణలపై చంద్రబాబు స్పందించి సమాధానం చెప్పాలి. లేనట్లయితే ప్రజాభీష్టం మేరకు శ్వేతపత్రం సమర్పించి విచారణకు ఆదేశించాలని సీఎం చంద్రబాబును విజయసాయిరెడ్డి డిమాండు చేశారు.

# లింగ అసమానతలను రూపుమాపడమే లక్ష్యం

## నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం

లింగ అసమానతలను రూపుమాపడమే లక్ష్యంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబరు 11న నిర్వహిస్తారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్, 192 దేశాలు సంతకం చేసిన మానవ హక్కుల ప్రకటనలో స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రతిబింబించేలా మ్యాన్ అన్న పదాన్ని పీపుల్‌గా మార్చింది. మహిళల ఆత్మగౌరవం కాపాడడం కోసం పోరాటం చేసిన ఎలానార్ రూజ్‌వెల్ట్ పుట్టిన రోజైన అక్టోబరు 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి గుర్తించింది. 2012, అక్టోబరు 11న తొలిసారిగా ఈ దినోత్సవం జరుపబడింది. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు (విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం)పై, వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.బాలికలు, యువతులు వారివారి రంగాలలో ప్రచారం, పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించేలా ఈ దినోత్సవ వేడుకలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ అంతర్జాతీయ బాలికా దినోత్సవం అవగాహన కలిగిస్తుంది. ప్రపంచ అభివృద్ధికి సంబంధించిన అనేక ప్రణాళికలలో బాలికలను చేర్చడంగానీ, వారిని పరిగణించడంగానీ చేయడంలేదు, అలాగే వారి సమస్యలను కూడా పట్టించుకోవడంలేదు. వాషింగ్టన్‌లోని యునైటెడ్ స్టేట్స్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ 2014లో అందించిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 62 మిలియన్లకు పైగా బాలికలకు విద్య అందడంలేదు. ప్రపంచవ్యాప్తంగా 5 నుండి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలు, అదే వయస్సు గల అబ్బాయిల కంటే 160 మిలియన్ గంటలకుపైగా ఇంటి పనుల కోసం తమ సమయాన్ని కేటాయిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా, నలుగురిలో బాలికల్లో ఒకరికి 18 ఏళ్ళకంటే ముందుగానే వివాహం జరుగుతోంది. 2016, అక్టోబరు 11న, ఐక్యరాజ్యసమితి వుమెన్ గుడ్‌విల్ అంబాసిడర్ ఎమ్మా వాట్సన్, బలవంతపు బాల్య వివాహాలను అంతం చేయాలని ప్రపంచ దేశాలను, కుటుంబాలను కోరింది. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియజేయడమేకాకుండా, ఆ సమస్యలు పరిష్కరించబడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగపడుతోంది. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు




అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా తన కార్యకలాపాలు నిర్వహించే ప్లాన్ ఇంటర్నేషనల్ అనే ఒక ప్రభుత్వేతర సంస్థ ప్రాజెక్టుగా ఈ అంతర్జాతీయ బాలికా దినోత్సవం ప్రారంభమైంది. ప్లాన్ ఇంటర్నేషనల్ రూపొందించిన బికాజ్ ఐ యామ్ ఎ గర్ల్ అనే క్యాంపెయిన్ నుండి అంతర్జాతీయ దినోత్సవ నిర్వహణ, వేడుకల ఆలోచన వచ్చింది. ఇది ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో బాలికలను సంరక్షించే ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతుంది. కెనడాలోని ప్లాన్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కెనడియన్ ఫెడరల్ ప్రభుత్వాన్ని సంప్రదించి మద్దతుదారుల కూటమిని కోరుతూ అంతర్జాతీయంగా అవగాహన పెంచుతూ, చివరికి ఐక్యరాజ్య సమితిని కూడా ఇందులో పాల్గొనాలని కోరింది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో కెనడా తన తీర్మానంతో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అధికారికంగా ప్రతిపాదించింది. కెనడా మహిళామంత్రి రోనా అంబ్రోస్ ఈ తీర్మానాన్ని స్పాన్సర్ చేసింది; 55వ ఐక్యరాజ్యసమితి కమిషన్‌లో మహిళల స్థితిగతులపై మద్దతుగా మహిళలు, బాలికల ప్రతినిధి బృందం ప్రదర్శనలు చేసింది. 2011, డిసెంబరు 19న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2012, అక్టోబరు 11న తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ఆమోదించే తీర్మానానికి ఓట్లు వేయగా, అధికారికంగా బాలికా దినోత్సవం గుర్తించబడిందిని తీర్మానం పేర్కొంది. ఈ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం ఒక నేపథ్యాన్ని కలిగి ఉంటుంది. 2012లో బాల్యవివాహాన్ని రూపుమాపడం, 2013లో బాలికల విద్య కోసం నూతననత్వం, 2014లో కౌమార బాలికలను సాధికారపరచడం, హింసను రూపుమాపడం. 2015లో కౌమార బాలికల శక్తి, విజన్ ఫర్ 2030, 2016లో బాలికల పురోగతి ,లక్ష్యాల పురోగతి, బాలికల గణనలు. 2017లో సాధికారిక బాలికలు, సంక్షోభాలకు ముందు, తరువాత,2018లో ఆమెతో ఒక నైపుణ్య బాలికల బృందం. 2013 నాటికి ప్రపంచవ్యాప్తంగా బాలికా దినోత్సవం సందర్భంగా సుమారు 2,043 కార్యక్రమాలు, వేడుకలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఈ బాలికా దినోత్సవాన్ని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు రూపొందించబడ్డాయి. భారతదేశంలోని ముంబైలో జరిగిన కచేరీ వంటి కార్యక్రమాలకు ఐక్యరాజ్యసమితి ఆర్థిక సహాయం అందిస్తుంది. గర్ల్ గైడ్స్ ఆస్ట్రేలియా వంటి ప్రభుత్వేతర సంస్థలు ఈ దినోత్సవం కోసం జరిగే కార్యక్రమాలు, కార్యకలాపాలకు సహకారం అందిస్తాయి. బాలికలు, ఫుట్‌బాల్ దక్షిణాఫ్రికా వంటి స్థానిక సంస్థలు తమ సొంత కార్యక్రమాలను రూపొందించుకున్నాయి, 2012లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా టీ-షర్టులను పంపిణీ చేశాయి, 1956లో జరిగిన బ్లాక్ సాష్ మార్చ్‌ను 20,000 మంది మహిళలు గుర్తుచేసుకున్నారు. 2013లో లండన్ సౌత్ బ్యాంక్‌లో ఈ దినోత్సవం సందర్భంగా రోజంతా ఒక కార్యక్రమం జరిగింది, ఇందులో బాడీ గాసిప్ నిర్మించిన నాటక, సినిమా ప్రదర్శనలు జరిగాయి. ఇది శరీర అకృతి, మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రచారం చేస్తుంది. వేలాది మంది కార్యకర్తలను, సంస్థలను ఆన్‌లైన్‌లోకి తీసుకురావడానికి సేజ్ గర్ల్, ఐట్విక్సీ సంస్థలు ఒక అంతర్జాల వేడుకను కూడా రూపొందించాయి.2016లో లండన్ విమెన్ ఆఫ్ ది వరల్డ్ (వావ్) అనే సంస్థ ఒక వేడుకను నిర్వహించింది, ఇందులో 250మంది లండన్ పాఠశాల బాలికలు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 2016లో, యునైటెడ్ స్టేట్స్ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా లింగ అసమానతను రూపుమాపడానికి ఒక ప్రకటన విడుదల చేశారు.

## కేంద్రంలో చంద్రబాబు పరపతి పెరిగిందా



**విజయవాడ, అక్టోబరు 10, పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు కీలకంగా మారనున్నారు. ఆయన త్వరలోనే కీ రోల్ పోషిస్తారని తెలిసింది. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలయితే చంద్రబాబు డిమాండ్ మరింత పెరగనుంది. హర్యానాలో తిరిగి బీజేపీ పుంజుకుంది. జమ్మూ కాశ్మీర్ లో మాత్రం ఇండియా కూటమి ముందంజలో ఉంది. ఎలా జరిగినా కేంద్ర ప్రభుత్వం చంద్రబాబు చెప్పినట్లు తలాడించాల్సిందే. ఎగ్జిట్ పోల్స్ కూడా దాదాపు అవే చెప్పాయి. కాంగ్రెస్ కూటములు రెండు రాష్ట్రాల్లో విజయం సాధిస్తుందని చెప్పాయి. దీంతో చంద్రబాబు ఇక అడిగింది అడిగినట్లు జరుగుతుంది. మోదీ కూడా తన పాత వైఖరిని పక్కన పెట్టి చంద్రబాబును మంచి చేసుకోవడానికే ప్రయత్నించాలి. ఒకరకంగా ఆంధ్రప్రదేశ్ కు ఇది శుభపరిణామమేనని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఇప్పుడు కేంద్రంలో తలెత్తాయి. మోదీ ప్రభుత్వం పూర్తిగా చంద్రబాబు మద్దతు పై ఆధారపడింది. అలాగని చంద్రబాబు గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యంగా ఆయన అనేక మార్లు ఢిల్లీ వెళ్లారు. కేంద్రంలో పెద్దలు కలిశారు. ముఖ్యంగా రాజధాని అమరావతి, పోలవరం నిధుల కోసం ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రం సహకరిస్తే ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేయడం సులువుగా మారుతుంది. చంద్రబాబు విభజన ఆంధ్రప్రదేశ్ కు రెండో సారి సరైన సమయంలో ఆయనకు ముఖ్యమంత్రి పదవి దక్కింది. మోదీని యాచించే పరిస్థితి నుంచి శాసించే స్థాయికి రావడం రాష్ట్రానికి మంచిదే.ఇప్పుడు చంద్రబాబు ముందున్న లక్ష్యం కేవలం ఆ రెండు ప్రాజెక్టులు మాత్రమే కాదు. కేవలం అమరావతి, పోలవరం ప్రాజెక్టు అని కూర్చుంటే భవిష్యత్ లో రాజకీయంగా ఇబ్బందులు తప్పవు. ఆయన మిగిలిన సమస్యలపైన కూడా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా విద్య, వైద్యం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు తేవాల్సి ఉంటుంది. అలా కాకుండా అమరావతి, పోలవరంపైనే ఫోకస్ పెడితే మాత్రం అభాసుపాలు కాక తప్పదు. మోదీ ప్రభుత్వం కూడా ఆ రెండింటికీ సాయం చేసి మిగిలిన వాటి విషయంలో చేతులెత్తేస్తే అప్పుడు జనాలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడతుంది.అయితే చంద్రబాబు నాయుడు అనుభవం ఉన్న నేత. ఆయనకు వేరు ఇంకొకరు చెప్పాల్సిన పనిలేదు. చరిత్రలో చిరస్థాయిగా తన పేరును నిలిచిపోవడానికి పోలవరం, అమరావతి నిర్మాణాలను పూర్తి చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. అదే సమయంలో అన్ని ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా, మరిన్ని నిధులు తేవాలన్న ప్రయత్నంలోనే ఢిల్లీలో మకాం వేసి ఉన్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో హామీని నెరవేర్చి ఆయన తానేంటో నిరూపించుకోవాలనుకుంటున్నారు. చంద్రబాబు కు అలా కలసి రావడంతో ఢిల్లీలో ఆయన చెప్పినట్లే జరిగే అవకాశాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే ఎక్కువ సార్లు ఢిల్లీ వెళ్లి రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నారన్నది అంతే నిజం.

## రూపాయి పల్లె గురించి తెలుసా...

**శ్రీకాకుళం, అక్టోబరు 10, పెన్ పవర్:** రూపాయి అధికారిక మారక ద్రవ్యం. భారతీయ కరెన్సీలో రూపీని రూపాయిగా పిలుస్తాం. ఇదే పేరుతో ఓ గ్రామం ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలంలో ఉన్న గిరిజన గ్రామం పేరే రూపాయి. అక్కడ నివశించేది అందరు గిరిపుత్రులే. సీతంపేట ఐటీడీఏ, మండలంలో కొతతగా చేరిన అధికారులు ఎవరైనా సరే ఒక్కసారైనా రూపాయి గ్రామాన్ని చూసి వస్తారు. పూర్వం కాలం నుంచి గ్రామానికి వచ్చిన పేరు అది కాదని స్థానికులు చెబుతుంటారు. చుట్టు పక్కల గ్రామల కంటే ఇ పల్లె ఆర్థికంగా బాగా మెరుగ్గా ఉండేదట. అప్పటి నుంచి దీన్ని రూపాయి గ్రామంగా పిలుస్తున్నారు. వాళ్లంతా పక్కనే ఉన్న గ్రామంలో మేకలను రూపాయికే కొనుగోలు చేసేవారట. దీంతో ఆ గ్రామం పేరు రూపాయిగా మారిందని చెప్పుకొస్తున్నారు. ఆ గ్రామ ఆదివాసీలు పండించే పంటలను మైదాన ప్రాంతంలో విక్రయించేవారు. అప్పట్లో వస్తువులు అమ్ముకుని తేచ్చే నాణేలను ఇంటి వద్ద జాగ్రత్త చేసే వాళ్లు. మరికొందరు భూమిలో పాతిపెట్టేవారట. అలా ఉంచిన నాణేలు చిలుము పట్టడంతో వాటిని చింత పండుతో కడిగి ఆరబెట్టేవాళ్లట. దీంతో ఆ గ్రామానికి రూపాయి ఊరుగా ఫిక్స్ చేశారంటూ మరో కథను వినిపిస్తున్నారు. కారణం ఏమైనా సరే రూపాయి పేరుతో ఆ గిరిజన ఏజెన్సీలోనే గ్రామానికి ప్రత్యేకత ఉంది. వినడానికి చిత్రంగా ఉన్న పేరుతో చాలాసార్లు గిరిపుత్రులు నవ్వులపాలు అయ్యామని చెబుతున్నారు. మైదాన ప్రాంతాలకు వచ్చి ఊరు చెబితే ఎదుటి వాళ్ల నవ్వుకునే వాళ్లు. మరికొందరు వెటకారంగా పిలిచే వారని ఇలాంటివి చాలా ఎదుర్కొన్నామని చెబుతున్నారు. ఇప్పుడు రూపాయిగా సుపరిచతం కావడంతో కొన్ని సూటిపోటు మాటలు తగ్గాయనిఅంటున్నారు. రూపాయి గ్రామం పేరు వింటే వైరేటిగా ఉందంటున్నారే తప్ప వివాదాలు లేవని చెబుతున్నారు. ఈ గ్రామం పక్కనే వాటర్ ఫాల్ ఉండడంతో వేర్వేరు గ్రామాల నుంచి వస్తుంటారు. ఈ పల్లె ఒక్కటే కాదు... ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో చాలా పేర్లు ఇలా వింతగా ఉంటాయి. ఉద్దానంలో ప్రతి పేరు వెనక పుట్టుగా కచ్చితంగా ఉంటుంది. టెక్కలి నియోజకవర్గంలో బొమ్మాలి పేర్లతో ఊళ్లు ఉంటాయి. వికీపిడియా ప్రకారం రూపాయి ఊరు ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే కాదు ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ జిల్లాలో కూడా ఉందట. ఆ ఊరి పేరు గౌర రూపాయి పీర్ అలీపూర్. ఇక్కడ 550 ఇళ్లు 3,097 మంది జనాభా ఉన్నారట.

## ఏడుపాయల దగ్గర తగ్గిన మంజీరా ప్రవాహం

**మెదక్ పెన్ పవర్:** ఎనిమిది రోజు తర్వాత ఏడుపాయల ఆలయం దగ్గర మంజీరా ప్రవాహం తగ్గింది. దాంతో అమ్మవారు గర్భగుడిలో దర్శనమిచ్చారు. ఎనిమిదవ రోజు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. గురువారం నాడు శ్రీ మహిషాసుర మర్ధిని గా దర్శనాన్ని వన దుర్గా భవాని ఇచ్చారు.

## కొంతమూరులో రెచ్చిపోయిన దొంగలు

**రాజానగరం** కొంతమూరులో దొంగలు హల్ చల్ చేసారు. తాళం వేసి ఊరెళ్లిన ఇంట్లో భారీగా బంగారు, వెండి, నగదు దోచుకెళ్లారు. బాధితురాలు భాధితురాలు బచ్చల గంగ అనే మహిళలు ఫిర్యాదుతో దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితులనుంచి కార్, రెండు బైక్ లు, మూడు కాసుల బంగారం, రెండున్నర కిలోల వెండి అభరణాలు, 20వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరు రాజమండ్రి రూరల్ ప్రాంతానికి చెందిన బండి ధర్మరాజు,వానపల్లి గౌరీ శంకర్ లు గా గుర్తించారు. నిందితులు చెడు వ్యాసనాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ గా చేసుకుని జిల్లా వ్యాప్తంగా దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ వెల్లడించారు. నిందితులపై గోకవరం, కోరుకొండ, రాజానగరం, బొమ్మూరు పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులు ఉన్నట్లు అయన అన్నారు.

# బుల్లెట్ ట్రైన్...వయా అమరావతి



**విజయవాడ, అక్టోబరు 10, పెన్ పవర్:** అమరావతికి ప్రధాన నగరాల నుంచి కనెక్టివిటీ పెంచేందుకు చంద్రబాబు చేస్తున్నప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. వచ్చే పదేళ్ల నాటికి అమరావతి మొత్తం ఓ రూపునకు వస్తుంది. ఉద్యోగ, ఉపాధినగరంగా మారుతుంది. అప్పటికల్లా బుల్లెట్ ట్రైన్ కూడా అమరావతికి వచ్చేలా చంద్రబాబు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఢిల్లీ పర్యటన తర్వాత చంద్రబాబునాయుడు అమరావతికి బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనల గురించి మీడియాకు తెలిపారు. దక్షిణాదిలో మూడు అతి పెద్ద మెట్రో నగరాలు ఉన్నాయి. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాజధానులు బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలను కలుపుతూ బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. ఈ బుల్లెట్ ఏపీ రాజధాని అమరావతి మీదుగా వెళ్లనుంది. అంటే.. ప్రధాన నగరాలను కలుపుతూ వెళ్లే బుల్లెట్ ట్రైన్ అమరావతి మీదుగా వెళ్తుంది. వచ్చే పదేళ్లనాటికి ఈ బుల్లెట్ ట్రైన్ పట్టలెక్కినా అప్పటికి అమరావతి కూడా ఓ రూపానికి వస్తుంది. బుల్లెట్ ట్రైన్ ప్రత్యేక ఆకర్షణ అవుతుంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు జపాన్ సహకారంతో ముంబై టు అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్‌కు శంకుస్థాపన చేశారు. ఇప్పటికి దాదాపుగా పదేళ్లు అవుతోంది. అయినా ఇంకా పూర్తి స్థాయిలో నిర్మాణం పుంజుకోలేదు. ఎప్పటికి తొలి పరుగు పెడుతుందో చెప్పలేని పరిస్థితి. లక్ష కోట్లకుపైగా ఖర్చు అయ్యే ప్రాజెక్టు కావడంతో ఆర్థిక సమస్యలూ వెంటాడుతున్నాయి. అయినా కేంద్రం.. ముందు ముందు బుల్లెట్ ట్రైన్స్‌కు డిమాండ్ పెరుగుతుందని గట్టి నమ్మకంతో ఇతర ప్రాంతాల్లోనూ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బుల్లెట్ ట్రైమ్ మాత్రమే కాకుండా హైస్పీడ్ రైళ్ల నెట్ వర్క్ పైనా ప్రత్యేకంగా ఆలోచనలు చేశారు. మొత్తం ఏడు మార్గాల్లో హైస్పీడ్ రైళ్లను ప్రతిపాదించారు. కానీ అమరావతి మార్గంలో మాత్రం బుల్లెట్ ట్రైన్‌నే ప్రతిపాదించారుబుల్లెట్ ట్రైన్ల కోసం ప్రస్తుతం ఉన్న ట్రాకులు పనికి రావు. దాని కోసం ప్రత్యేకంగా ట్రాక్ వేయాల్సి ఉంటుంది. బులెట్ ట్రైన్ అనుసంధానంతో పెరగనున్న ఎకానమీ ఆక్టివిటీస్ పెరుగుతాయని.. 2026 నుండి బులెట్ ట్రైన్ పనులు ప్రారంభం అవుతాయని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర రైల్వే శాఖ పూర్తి స్థాయి డీపీఆర్ రెడీ చేసిన తర్వాత ప్రకటన ఇచ్చే అవకాశం ఉంది. సాఫ్ట్ వేర్ రంగాల్లో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి సాధిస్తు?నాయి. మూడు నగరాల మధ్య ప్రయాణాలు కూడా ఎక్కువగా ఉంటాయి. వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తే ఆదరణ ఉంటందని నమ్ముతున్నారు. అమరావతికి అన్ని వైపు నుంచి కనెక్టివిటీ పెరిగితే.. అభివృద్ధి కూడా వేగంగా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు నమ్మకంతో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకమైన ఆసక్తితో రైలు, రోడ్డు, విమాన మార్గాల ద్వారా సౌకర్యాలు మరింత పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# టీజీకి పదవి ఖాయమేనా

**కర్నూలు, అక్టోబరు 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో సీనియర్ నేత టీజీ వెంకటేశ్ త్వరలోనే పదవి లభిస్తుందన్న ప్రచారం ఊపందుకుంది. భారతీయ జనతా పార్టీ ఆయనకు అతి త్వరలోనే గుడ్ న్యూస్ చెబుతుందంటున్నారు. ఈ మేరకు హైకమాండ్ వద్ద కూడా ప్రతిపాదనలున్నాయని చెబుతున్నారు. టీజీ వెంకటేశ్ 2014లో కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరారు. అయితే కర్నూలు పట్టణ నియోజకవర్గం నుంచి ఓటమిపాలు కావడంతో ఆయనకు టీడీపీ నుంచి రాజ్యసభ పదవి దక్కింది. టీడీపీలో కీలకంగా ఉన్న టీజీ వెంకటేశ్ తర్వాత 2019 ఎన్నికల్లో టీడీపీ ఏపీలో ఓటమి పాలయిన తర్వాత నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఆయన కూడా బీజేపీలో చేరిపోయారు.ఆయన బీజేపీలోనే కొనసాగుతున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన బీజేపీ పెద్దలను ఆకట్టుకున్నారు. వారి దృష్టిలో పడ్డారు. టీజీ వెంకటేశ్ కేవలం సామాజికవర్గం పరంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా బలవంతుడు కావడం ఆయనకు అదనపు బలం అయింది. ఢిల్లీలో ఆయనకున్న పరిచయాలను గత మూడేళ్లలో పెంచుకున్నారు. నేరుగా మోదీ, అమిత్ షాతో ఆయన పరిచయాలను బాగా పెంచుకున్నారు. తన కుమారుడు టీజీ భరత్ ను మాత్రం 2014 నుంచి టీడీపీలోనే ఉంచారు. టీజీ భరత్ 2019 ఎన్నికలలో కర్నూలు నుంచి ఓటమి పాలయినా 2024 లో మళ్లీ అదే టీడీపీ నుంచి గెలిచి చంద్రబాబు కేబినెట్ లో పరిశ్రమల శాఖ మంత్రిగా చేరారు.కుమారుడి రాజకీయ భవిష్యత్ లో టీజీ వెంకటేశ్ కు ఇక దిగులు లేదు. అయితే తన వయసు మించి పోవడంతో ఇక ప్రత్యక్ష ఎన్నికలకు ఆయన దాదాపు దూరమయినట్లే. అయితే రాజకీయాలను వదిలే అవకాశం మాత్రం లేదు. కమలం పార్టీలోనే ఉంటూ ఎదగాలన్నది ఆయన ఆలోచన. కర్నూలులోనే ఉండి ఆయన హస్తిన పెద్దలతో టచ్ లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. కమలం పార్టీని రాయలసీమలో బలోపేతం చేయాలను కుంటే తన ఏదో ఒక గౌరవమైన పదవి ఇవ్వాలని టీజీ వెంకటేశ్ కోరినట్లు తెలిసింది. అయితే రాష్ట్రంలో ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాలు టీజీ వెంకటేశ్ కు దక్కే ఛాన్స్ లేదు. ఎందుకంటే అవి టీడీపీ, జనసేనలకు రిజర్వ్ అయిపోయాయి.టీడీపీ నుంచి వచ్చిన నేత కావడం కొంత టీజీ వెంకటేశ్ కు మైనస్ అయినా ఆయన పార్టీ ఆర్థిక అవసరాలను తీర్చే నాయకుడు కావడంతో బీజేపీ పెద్దలు కూడా టీజీ వెంకటేశ్ కు పదవి ఇచ్చేందుకు సిద్ధమయినట్లు తెలిసింది. ఆయన వయసును గౌరవిస్తూ గవర్నర్ పదవిని ఇవ్వాలని దాదాపు నిర్ణయం జరిగిపోయినట్లు సమాచారం. ఈ మేరకు టీజీ వెంకటేశ్ తన సన్నిహితుల వద్ద కూడా చెబుతున్నట్లు తెలిసింది. ఆయనకు ముఖ్యమైన రాష్ట్రానికి గవర్నర్ గా అతిత్వరలోనే నియమిస్తున్నట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి టీజీ వెంకటేశ్ కు గవర్నర్ పదవి దక్కుతుందా? లేదా? అన్నది తెలియాలంటే కొంత కాలం ఆగాల్సిందే.

## కూతురి కోసం కోలగట్ల పవన్ జపం

**విజయనగరం, అక్టోబరు 10, పెన్ పవర్:** విజయనగరం జిల్లాలో మాస్ ఫాలోయింగ్ ఉన్న లీడర్లలో ముందు వరుసలో ఉంటారాయన. జిల్లాలో దిగ్గజ వంశాన్ని ఎదుర్కొని రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అలాంటి మాస్ లీడర్ మొన్నటి ఎన్నికల్లో దారుణ పరాజయం తర్వాత సొంత పార్టీ వారికే కనిపించడం మానేశారు. పవర్‌లో ఉన్నప్పుడు హెలికాప్టర్‌తో పూలు జల్లించుకున్న ఆ ఘనాపాటి.. ఇప్పుడు ముఖం చాటేయడంతో ఆయన పొలిటికల్ ఫ్యూచర్‌పై రకరకాల ప్రచారాలు మొదలయ్యాయి. ఇంతకీ ఆ లీడర్ ఎవరో తెలుసా? కోలగట్ల వీరభద్ర స్వామి.మొదట కాంగ్రెస్ , తర్వాత ఇండిపెండెంట్ , ఆ తర్వాత వైసీపీ ఇలా సాగిన కొలగట్ల రాజకీయ ప్రస్థానం ఇప్పుడు కొత్త టర్న్ తీసుకోబోతుందని అంటున్నారు. కొలగట్ల జనసేన వైపు చూస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. పార్టీలు మారినా విజయనగరం జిల్లా కేంద్రంలో స్వామికి మంచి పట్టు ఉంది. మాస్ లీడర్ గా ఆయనకి ఉన్న గుర్తింపు ఇంకెవ్వరికీ లేదనే చెప్పాలి. అశోక్ గజపతిని, ఆయన కుమార్తెని కూడా ఓడించిన చరిత్ర ఆయనది.ఎన్ని సార్లు ఓడిన పట్టువడాలని విక్రమార్కుడిలా పోరాటం చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అశోక్‌గజపతిరాజుని, ఆయన కుమార్తె అదితిని ఓడించిన ఘనత దక్కించుకున్నారు. అందుకు తగ్గట్లు కేడర్ ను కూడా బలోపేతం చేసుకున్నారు. అంతటి మాస్ ఇమేజ్ ఉన్న లీడర్ కాబట్టే 2014లో కొలగట్ల ఓడిపోయినప్పుడు జగన్ పిలిచి మరీ ఎమ్మెల్సీని చేశారంటారు. మాస్ ఇమేజ్‌కి తగ్గట్లే అవినీతి మరకలను అంటించుకున్నారనే టాక్ నడుస్తోంది.

గత ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో నియోజకవర్గంలో అన్ని వ్యాపారాలలో వాటాలు మాత్రమే కాకుండా , కొన్నిటిని దబాయించి మరీ లాక్కున్నారనే అపప్రద కూడా మూటగట్టుకున్నారట. రియల్ ఎస్టేట్‌లో అయితే తన సొంత ఎస్టేట్ అన్నట్లు దోచుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆయన చిన్న అల్లుడు ఈశ్వర్ కౌశిక్‌పై గంజాయి సరఫరా ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.చిన్న కుమార్తెను మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ గా చేసి కార్పొరేషన్ సొమ్మును దోచుకున్నారని వైసీపీ నేతలే ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలే మొన్నటి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోవడానికి కరణమనే వాదనలూ ఉన్నాయి. విజయనగరం జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనంతగా ప్రత్యర్థి అదితి గజపతిరాజు ఆయనపై 60 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచారు. అదంతా కొలగట్ల అవినీతి ఫలితమే అంటున్నారు.గత ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్ అయిన తర్వాత సారు చేసిన అతి అంతా ఇంతా కాదు. డిప్యూటీ స్పీకర్ పదవి రాగానే విజయనగరంలో ర్యాలీ నిర్వహించి హెలీకాప్టర్ నుండి పూలు జల్లించుకున్న ఘనత ఆయనది. ఆ తర్వాత ప్రెస్ మీట్‌ల మీద ప్రెస్ మీట్‌లు పెట్టి విజయనగరంలో ఉన్న అశోక్ గజపతిరాజు నుంచి అమరవతిలో ఉన్న చంద్రబాబు , పవన్ కళ్యాణ్ లను ఆయన తిట్టని తిట్టు లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా జగన్ మెప్పు కోసం పవన్‌కళ్యాణ్ పై ఒక రేంజ్లో రెచ్చిపోయారు.తాను సరిపోను అన్నట్లు మాజీ మంత్రి బొత్స నుండి ఎంపి , ఎమ్మెల్యేలను తన ఇంటికి పిలిపించి మరీ ప్రెస్ మీట్‌లు పెట్టించి తిట్టించేవారు. చంద్రబాబును సీఎం ను చేయడానికె పవన్ కళ్యాణ్ ఆరాటం అంటూ హేళన చేసిన సందర్భాలూ ఉన్నాయి. పవన్ కళ్యాణ్ కి రాజకీయం అంటే తెలుసా అంటూ చులకనగా మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు స్పాట్ ఇతే ఇదంతా ఇప్పుడెందుకు అంటే.. సారు ఇపుడు జనసేనలోకి చేరేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారట. ఎలాగైనా గాజు గ్లాసు గూటికి చేరాలని ప్రదక్షిణలు చేస్తున్నారంట.అయితే, ఇదంతా తన రాజకీయ భవిష్యత్తు కోసం కాదంట.. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అయిన తన చిన్న కుమార్తె కొలగట్ల శ్రావణి రాజకీయ భవిష్యత్ కోసమే అంటున్నారు. మొన్న ఎన్నికల్లోనే కుమార్తెను రంగంలోకి దింపుదామని అనుకున్నప్పటికీ జగన్ దానికి ఒప్పుకోలేదంట. అయితే కొలగట్ల దాయదులు అవనాపు , గురాన కుటుంబాలు ఇప్పటికే జనసేనలో చేరడం , కూటమి ప్రభుత్వంలో భాగస్వాములు కావడంతో స్వామికి నిద్ర పట్టడం లేదట. ఎలాగైనా జనసేనలో చేరి దాయదులకు చెక్ పెట్టడంతో పాటు నియోజకవర్గంలో జనసేనకి పెద్ద దిక్కుగా మారాలని ఉవ్విళ్లూరుతున్నారట.

స్వామి జనసేనలో చేరేందుకు తీవ్రంగా ప్రయత్తిస్తుండటంతో రామేశ్వరం పోయినా శనీశ్వరం వదలడం లేదని అవనాపు, గురాన ఫ్యామిలీలు తెగ ఇదైపోతున్నాయంట. కానీ కొలగట్ల చెరికకు జనసేన ముఖ్య నాయకులు ఇప్పటికే ససేమిరా అన్నారనే టాక్ నడుస్తోంది. దీంతో స్వామి రూటు మార్చి అమెరికాలో ఉద్యోగం చేసుకుంటున్న పెద్ద అల్లుడుతో మంతనాలు జరుపుతున్నారట. పెద్ద అల్లుడు ద్వారా జనసేన కీలక నాయకుడు నాదెండ్ల మనోహర్ కి రాయబారాలు పంపుతున్నారంట.గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50 కి 48 డివిజన్లలో వైసీపీ గెలిచింది.. అప్పటి నుంచి నిన్న మొన్నటివరకు కార్పొరేషన్‌ను ఒంటి చేత్తే శాసించారాయన ? అలాంటాయన ఓటమి తర్వాత ఇల్లు కదలడం లేదు సరికదా , ఎవ్వరినీ రానివ్వడం లేదంట. దానికి కారణం ఆయన జనసేనలో చేరిన తర్వాతనే కార్పొరేషన్ పై ఫోకస్ చేస్తారని వాదనలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలో కార్పొరేషన్‌ను జనసేనకు గిఫ్ట్‌గా ఇస్తానని ప్రతిపాదనలు పెడుతూ పార్టీ మారాలని చూస్తున్నారంట. మరి చూడాలి ఆయన ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో.

# భారత పర్యటనలో కివీస్ జట్టుకు కెప్టెన్సీ వహించేందుకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా లేను

**ఇటీవల శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ లో న్యూజిలాండ్ ఓటమి**

**కెప్టెన్సీ నుంచి తప్పుకున్న టిమ్ సౌథీ**

**కొత్త కెప్టెన్ గా టామ్ లేథమ్**

**అక్టోబరు 16 నుంచి టీమిండియా, కివీస్ మధ్య 3 టెస్టుల సిరీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ జట్టు అక్టోబరు 16 నుంచి భారత్ లో టెస్టు సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ లో భాగంగా టీమిండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు టెస్టులు జరగనున్నాయి. ఇటీవల శ్రీలంకతో ఆడిన రెండు టెస్టుల సిరీస్ లో ఓటమిపాలైన కివీస్ జట్టు కొత్త కెప్టెన్ తో భారత పర్యటనకు వస్తోంది.

సీనియర్ బౌలర్ టిమ్ సౌథీ కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో, అతడి స్థానంలో టామ్ లేథమ్ ను న్యూజిలాండ్ జట్టుకు పూర్తి స్థాయి కెప్టెన్ గా నియమించారు. తన నియామకంపై టామ్ లేథమ్ స్పందించాడు. గతంలో పలుమార్లు ఆపద్ధర్మ కెప్టెన్ గా వ్యవహరించానని, ఇప్పుడు ఫుల్ టైమ్ కెప్టెన్ గా బాధ్యతలు అందుకుంటున్నానని తెలిపాడు. అయితే, తాను ఇప్పటికీ పూర్తి స్థాయి కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టేందుకు నూటికి నూరు శాతం సిద్ధంగా లేనని అన్నాడు. సహచరుల మద్దతుతో జట్టును నడిపిస్తానని, క్రమంగా తనదైన పంథాలో ముందుకు వెళతానని లేథమ్ వివరించాడు. అంతర్జాతీయ యవనికపై కివీస్ బ్రాండ్ క్రికెట్ ఆడి మెరుగైన ఫలితాలు రాబడతామని, అందుకు భారత్ తో సిరీస్ ద్వారా శ్రీకారం చుడతామని లేథమ్ తెలిపాడు. అయితే, భారత్ లో టెస్టు సిరీస్ ఆడడం ఏమంత సులభం కాదని అభిప్రాయపడ్డాడు.

# 22 గ్రాండ్ స్లామ్ వీరుడి కథ ముగిసింది: టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నాదల్

**హైదరాబాద్ పెన్ పవర్:** టెన్నిస్ అభిమానులకు బిగ్ షాక్. 22 ఏళ్ళ గ్రాండ్ స్లామ్ వీరుడు రఫెల్ నాదల్ తన కెరీర్ కు గుడ్ బై చెప్పాడు. నాదల్ గురువారం (అక్టోబర్ 10) అధికారికంగా తన రిటైర్మెంట్ ప్రకటించాడు. 2024 నవంబర్‌లో జరగబోయే డేవిస్ కప్ ఫైనల్ తర్వాత రిటైర్ కానున్నట్లు అతను వెల్లడించాడు. తన రిటైర్‌మెంట్‌ను ప్రకటిస్తూ నాదల్ 13 భాషల్లో అందరికీ చాలా ధన్యవాదాలు తెలిపాడు. చివరి రెండు సంవత్సరాలు తన కెరీర్ లో కష్టంగా గడిచాయని ఈ స్పెయిన్ బుల్ తెలిపాడు.

2001లో నాదల్ 14 ఏళ్ళ వయసులో ప్రొఫెషనల్ టెన్నిస్ లోకి అడుగుపెట్టాడు. 2002 లో తొలి సారి విజయాన్ని నమోదు చేశాడు. నాదల్ తన కెరీర్ లో 22 గ్రాండ్ స్లామ్స్ టైటిల్స్ గెలిచాడు. వీటిలో 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ ఉన్నాయి. ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండు సార్లు.. వింబుల్డన్ రెండు సార్లు రెండు సార్లు నెగ్గాడు. నాలుగు యూఎస్ ఓపెన్ ట్రోఫీలను తన ఖాతాలో వేసుకున్నాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్ సింగిల్స్ లో గోల్డ్ మెడల్ గెలిచాడు. 2016 బ్రెజిల్ లో జరిగిన ఒలింపిక్స్ లో డబుల్స్ లో గోల్డ్ మెడల్ అందుకున్నాడు. ప్రతిష్టాత్మక డేవిస్ కప్ ను 2004, 2009, 2011,2019 లో స్పెయిన్ కు అందించాడు. ఓవర్ల గా నాదల్ తన కెరీర్ లో 92 టైటిల్స్ గెలిచాడు. వీటిలో పాటు 36 మాస్టర్ 1000 టైటిల్స్ ఉన్నాయి. మెన్స్ సింగిల్స్ లో అత్యధిక గ్రాండ్ స్లామ్స్ టైటిల్స్ గెలిచిన రెండో ఆటగాడిగా నాదల్ తన కెరీర్ ను ముగించాడు. 2022 లో ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన తర్వాత నాదల్ కు కష్టాలు మొదలయ్యాయి. 2023, 2024 లో గాయాలతో మెగా టోర్నీలకు దూరమయ్యాడు. ముఖ్యంగా తనకు కలిసి వచ్చిన ఫ్రెంచ్ ఓపెన్ లో 2024 తొలి రౌండ్ లోనే ఓడిపోవడంతో ఈ స్పెయిన్ స్టార్ తన కెరీర్ కు వీడ్కోలు చెప్పేశాడు.



# తండ్రి మరణం.. ఆసీస్‌తో కీలక పోరుకు పాకిస్థాన్ కెప్టెన్ దూరం



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ ఫాతిమా సనా కుటుంబలో విషాదం చోటు చేసుకుంది. ఆమె తండ్రి మరణించాడు. దీంతో సనా గురువారం (అక్టోబర్ 10) తన దేశం బయలుదేరనుంది. ఫాతిమా సనా గురువారం తిరిగి కరాచీకి వెళ్లనున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ధృవీకరించింది. ఈ నేపథ్యంలో ఆమె దుబాయ్‌లో శుక్రవారం (అక్టోబర్ 11) ఆస్ట్రేలియాతో జరిగే కీలక మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఒక్క రోజు వ్యవధిలో ఆమె వెళ్లి రావడం కష్టం కావున ఆసీస్ తో మ్యాచ్ కు దూరమవ్వడం దాదాపు ఖాయంగా మారింది. ఓపెనర్ మునీబా అలీ ఫాతిమా స్థానంలో కెప్టెన్సీ చేపట్టే అవకాశం ఉంది. పాకిస్థాన్ ఇప్పటివరకు రెండు మ్యాచ్ ల్లో ఆడింది. తొలి మ్యాచ్ లో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. ఆ తర్వాత భారత్ తో జరిగిన మ్యాచ్ లో ఓడిపోయింది. ప్రస్తుతం పాక్ పటిష్టమైన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తో తలపడాల్సి ఉంది. సెమీస్ కు వెళ్లాలంటే ఈ రెండు మ్యాచ్ ల్లో భారీగా గెలవడం తప్పనిసరి. ఈ దశలో ఆ జట్టు కెప్టెన్ సేవలు కోల్పోవడంతో ఎదురు దెబ్బ తగలనుంది.

మహిళల టీ20 ప్రపంచకప్ ఆరంభం నుంచి ఫాతిమా సనా పాకిస్థాన్ తరఫున అత్యుత్తమంగా రాణించింది. తన కెప్టెన్ తో శ్రీలంకపై మ్యాచ్ గెలిపించింది. ఈ మ్యాచ్ లో బ్యాటింగ్ లోనూ 30 పరుగులు చేసి బౌలింగ్ లో రెండు కీలక వికెట్లు పడగొట్టింది. భారత్ తో జరిగిన మ్యాచ్ లోనో జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మలను ఔట్ చేసి భారత్ కు పాక్ గట్టి పోటీ ఇచ్చేలా చేసింది.

## నలుపు రంగులో సోనమ్ బజ్వా వైబ్స్





## రోజంతా చంపు! మోనాలిసా యొక్క చిక్ వైబ్స్ లక్షాలు!



# ప్రభాస్ తో గోపీచంద్ సినిమా ఏమన్నాడంటే?

ప్రభాస్-గోపీచంద్ క్లోజ్ ఫ్రెండ్స్ అన్న సంగతి తెలిసిందే. నటులు కాకముందే ఇద్దరు చెడ్డీ దొస్తులు. నటులుగా అరంగేట్రం చేసిన తర్వాత వర్షం సినిమాలో కలిసి నటించారు. అందులో ప్రభాస్ హీరో కాగా, గోపీచంద్ విలన్ పాత్ర పోషించాడు. వాళ్లిద్దరు కలిసి నటించిన ఒకే ఒక్క సినిమా ఇంతవరకూ అదొక్కటే. ఆ తర్వాత మళ్లీ కలిసి పనిచేయలేదు. నేడు ప్రభాస్ పెద్ద పాన్ ఇండియా స్టార్ అన్న సంగతి తెలిసిందే. నటుడిగా ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆస్థాయికి చేరుకున్నాడు. ఇప్పుడు ప్రభాస్ ఏ డైరెక్టర్ తో సినిమా తీసినా? అది 1000 కోట్ల వసూళ్ల రేంజ్ ఉన్న సినిమా లెక్క. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో గోపీచంద్ కి ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. - విశ్వం- ప్రమోషన్ లో భాగంగా ప్రభాస్ తో కలిసి సినిమా ఎప్పుడు చేస్తున్నారు? అంటే తన మనసులో మాట చెప్పాడు.-నాకు నటించాలని ఉంది. కానీ అన్నీ సెట్ అవ్వాలి. అది ఎప్పుడు జరుగుతుందో నాకు కూడా తెలియదు. కుదిరిప్పుడు తప్పకుండా చేస్తాం- అని అన్నాడు. - ఏడు ఆస్కార్‌లు కొల్లగొట్టాక నోలాన్ సైలెన్స్ వెనక ప్రభాస్ ఇంతవరకూ ఇతర స్టార్లతో కలిసి మల్టీస్టారర్ సినిమాలు చేసింది లేదు. అన్నీ సోలో సినిమాలే చేసాడు. సోలోగానే బాక్సాఫీస్ ని షేక్ చేసే సత్తా ఉన్న నటుడు. ఇటీవల రిలీజ్ అయిన జకల్కి 2898- చిత్రం తర్వాత ప్రభాస్ ప్రయోగాలకు ఏమాత్రం వెనక్కి తగ్గని నటుడని ప్రూవ్ అయింది. అందులో అమితాబచ్చన్ తో పోలిస్తే ప్రభాస్ రోల్ ఏమంత బలంగా ఉండదు. సినిమాలో అమితాబచ్చన్ హీరోగానే సాగుతుంది. దీనికి ఇంకా కొనసాగింపు పార్ట్ -2 ఉంది? అందులో డార్లింగ్ పాత్ర ఎలా ఉంటుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ప్రభాస్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లు కొన్ని ఉన్నాయి. -రాజాసాబ్-పౌజీ-తర్వాత సందీప్ రెడ్డి వంగతో -స్పిరిట- చిత్రాన్ని పట్టాలెక్కిస్తాడు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com